సాక్షి సంగారెడ్డి

మంగళవారం ♦ 9 ♦ మే ♦ 2023



చెక్‌పోస్ట్ తనిఖీ

తెలంగాణ–కర్ణాటక అంతరాష్ట్ర సరిహద్దులో చిరాగ్‌పల్లి–మాడ్గి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను సోమవారం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రఘురాం తనిఖీ చేశారు. 8లో



అంబేడ్కర్ త్యాగాలు మరువలేనివి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. 9లో

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 21 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 16 మందికి చేసినట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఎస్సీ వర్గీకరణపై మాట్లాడకపోవడం దారుణం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బుచ్చేంద్ర

కొండాపూర్(సంగారెడ్డి): బీఎస్పీ చీఫ్ మాయావతి తెలంగాణలో నిర్వహించిన బహిరంగ సభలో ఎస్సీ వర్గీకరణపై మాట్లాడకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బుచ్చేంద్ర మాదిగ అన్నారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డిలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 7వ తేదీ హైదరాబాద్‌లో తెలంగాణ భరోసా సభకు హాజరైన మాయావతి మాదిగ, ఉపకులాల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణపై మాట్లాడకపోవడం సిగ్గు చేటని, తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సామాజిక న్యాయమైన ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వకపోవడం కాన్షీరాం సిద్ధాంతానికి వ్యతిరేకమేనన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వని ఏ పార్టీకైన మాదిగ, ఉపకులాల ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

జాతీయ యువ సంగమంలో తారా విద్యార్థి



రంజిత్ రెడ్డిని అభినందిస్తున్న అధ్యాపకులు

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ రంజిత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ యువ సంగమం క్యాంపులో పాల్గొని తారా కళాశాలకు గుర్తింపు తెచ్చాడని ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ సోమవారం అన్నారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ సమైక్యత, వారసత్వాన్ని యువతలో పెంచడంలో భాగంగా కేంద్ర విద్యాశాఖ జాతీయ యువ సంఘం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. వరంగల్‌లోని నిట్ బృందం ఉత్తరాఖండ్‌లోని ఐఐటీ రూర్కీలో ఏప్రిల్ 27 నుంచి మే 5వ తేదీ వరకు జరిగిన కార్యక్రమంలో పాల్గొందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన 42 మంది బృందంలో తారా బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థి రంజిత్ రెడ్డి ఉండటం కళాశాలకు గర్వకారణమన్నారు. రంజిత్‌రెడ్డి తెలంగాణ వాయిద్యాలు ఫ్లూట్, డప్పుకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చాడని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, డాక్టర్ ఉపేందర్ పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌తో టాటా టెక్నాలజీస్ ఒప్పందం



ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న టాటా టెక్నాలజీస్ ప్రతినిధులు, ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్ (ఎస్‌డీవీ), అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టం (ఏడీఏఎస్) సాంకేతికత అభివృద్ధి కోసం ఐఐటీ (భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ) హైదరాబాద్, టాటా టెక్నాలజీస్‌తో ఒప్పందం చేసుకున్నారు. వాహన కంపెనీలు స్వయం ప్రతిపత్తి సాంకేతికతలను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడం కోసం ఈరెండు సంస్థలు పరస్పరం సహకరించుకుంటున్నాయి. హైదరాబాద్ ఐఐటీలో టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆన్ అటానమస్ నావిగేషన్ (టీఐహెచ్ఏఎన్) సంస్థ వాహనాలపై పరిశోధనలు చేస్తోంది. రానున్న రోజుల్లో టాటా టెక్నాలజీస్‌కు సహకారం అందించనుంది. ఈ సంస్థలు ప్రధానంగా టాటా టెక్నాలజీస్ ఇంజనీర్లకు నైపుణ్యం, ప్రయోగాత్మక శిక్షణపై దృష్టి సారిస్తుంటాయి. సోమవారం టాటా టెక్నాలజీస్ ఎండీ, సీఈఓ వారెన్‌హారీస్ మాట్లాడుతూ ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఆటోమోటివ్ వాహనాల తయారీదారులు ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, టాటా టెక్నాలజీస్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీరామ్ లక్ష్మీనారాయణ, ఐఐటీహెచ్ టీఐహెచ్ఏఎన్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రొఫెసర్ పి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తేలిన పంటనష్టం లెక్క

- మూడో విడతతో 2,468 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- అత్యధికంగా నారాయణఖేడ్ డివిజన్‌లో
- లెక్కలు తేల్చిన వ్యవసాయశాఖ
- నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : అకాల వర్షాలతో నష్టపోయిన పంటల లెక్కలను వ్యవసాయశాఖ తేల్చింది. మూడో విడతలో కురిసిన అకాల వర్షానికి మొత్తం 1,643 మంది రైతులకు సంబంధించి 2,468 ఎకరాల్లో వివిధ పంటలు నష్టపోయినట్లు గుర్తించింది. మొత్తం 131 గ్రామాల్లో పంటలకు నష్టం జరిగినట్లు తేలింది. ఇందులో 1,242 ఎకరాలు హార్టికల్చర్ పంటలు కాగా, మిగిలిన 1,226 ఎకరాల్లో వ్యవసాయ పంటలకు నష్టం జరిగినట్లు తేలింది.

- ఈ ఏడాది ఏప్రిల్ 29 నుంచి ఈనెల 2 వరకు జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. కొన్ని చోట్ల వడగండ్లు కూడా పడ్డాయి. ఈ అకాల వర్షాలు అన్నదాతను నిండా ముంచాయి.
- పంటలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ప్రధానంగా మొక్కజొన్న, వరి, సోయా, జొన్న, గోధుమ వంటి వ్యవసాయ పంటలతో పాటు, హార్టికల్చర్ పంటలైన మామిడి, టమాట, అరటి, బొప్పాయి వంటి పంటలకు నష్టం జరిగింది.

33 శాతానికి మించి నష్టం

- వర్షం కురిసిన వెంటనే వ్యవసాయశాఖ అధికారులు సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించిన ప్రాథమిక అంచనాలు తయారు చేశారు. అనంతరం డిటైల్డ్ సర్వే చేపట్టారు.
- ఆయా గ్రామాల్లో ఏ రైతుది ఎంత విస్తీర్ణంలో ఏ పంట నష్టపోయిందనే దానిపై వ్యవసాయ విస్తరణ అధికారులు సర్వే చేశారు. పంట 33 శాతానికి మించి నష్టపోతేనే పంట నష్టంగా వ్యవసాయశాఖ గుర్తిస్తుంది.
- ఇలా 33 శాతానికి మించి నష్టం పోయిన రైతులు, పంటల వివరాలను క్రోడీకరించారు. ఈ మేరకు నివేదికలను తయారు చేసి నష్ట పరిహారం పంపిణీ చేసేందుకు నిధులు విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక పంపారు.

అత్యధిక పంట నష్టం

- జిల్లాలో అత్యధికంగా నారాయణఖేడ్ వ్యవసాయ డివిజన్ పరిధిలో పంటలకు ఎక్కువగా నష్టం జరిగింది. నారాయణఖేడ్, నాగల్‌గిద్ద, మనూరు, సిర్గాపూర్, కల్హేర్, కంగ్టి మండలాలల్లో పంట నష్టం అధికంగా ఉంది.
- అలాగే జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలో కోహీర్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అలాగే సంగారెడ్డి డివిజన్ పరిధిలోని కందిలోనూ పంటలకు నష్టం జరిగింది.

మండలాల వారీగా ఇలా..

మండలం	నష్ట పోయిన రైతుల సంఖ్య	పంట నష్టం విస్తీర్ణం
కోహీర్	637	848
జహీరాబాద్	321	697
మొగుడంపల్లి	71	160
మనూర్	55	75
కల్హేర్	108	147
సిర్గాపూర్	63	72
నారాయణఖేడ్	140	242
నాగల్‌గిద్ద	32	43
కంగ్టి	181	159
కంది	35	25
మొత్తం	1,643	2,468

వైద్యులు అంకితభావంతో పనిచేయాలి

కలెక్టర్ డాక్టర్ శరత్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డిటౌన్: వైద్యులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఆరోగ్య మహిళా కేంద్రాల వైద్య సిబ్బంది, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ తదితరులతో ఆరోగ్య మహిళ కార్యక్రమ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళల ఆరోగ్యం కోసం చేపట్టిన ఆరోగ్య మహిళా కార్యక్రమ లక్ష్యం నెరవేరేలా వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. జిల్లాలో ప్రతీ మంగళవారం బిలాల్పూర్, ఝరాసంగం, జిన్నారం, ఆర్సీ పూర్‌లలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కేంద్రాలలో ఓపి మరింత పెరగాలన్నారు. ప్రతీవారం ఆరోగ్య మహిళా కేంద్రాలను సందర్శించాలని డీఆర్డీఓ, జెడ్పీసీఈఓకు సూచించారు. నిర్లక్ష్య ధోరణి సహించబోమని హెచ్చరించారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఆరోగ్య మహిళకు సంబంధించిన ఆయా సిస్టం ఏర్పాటు చేయాలని, వచ్చిన రెఫరల్ కేసులన్నింటికీ మోమోగ్రఫీ చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్‌కు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ గాయత్రి దేవి, డాక్టర్ నాగలక్ష్మి, డీఆర్డీఓ శ్రీనివాసరావు, జెడ్పీసీఈవో ఎల్లయ్య, మెప్మా పీడీ గీత, బిలాల్పూర్, ఝరాసంగం, జిన్నారం, ఆర్సీపురం పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరినీ ఓటరు జాబితాలో చేర్చాలి

సంగారెడ్డి టౌన్: ఓటర్ జాబితా నవీకరణలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరపాట్లకు తావులేకుండా స్పష్టమైన ఓటరు జాబితా ను రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు.18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులపై విచారణ జరుపుతున్నారని, రాజకీయ పార్టీల ప్రతినిధులు సైతం బూత్ స్థాయి అధికారులకు సహకరిస్తూ స్పష్టమైన జాబితా రూపొందించడానికి కృషి చేయాలన్నారు. అభ్యంతరాలు ఉన్నట్లయితే బూత్ స్థాయి అధికారికి, తహసిల్దార్లకు తెలియజేయాలని సూచించారు. ఓటర్ జాబితా వంద శాతం పారదర్శకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బస్వకళ్యాణ్‌లో పోరు ముఖాముఖి



శరణు సల్గార, బీజేపీ



విజయ్‌సింగ్, కాంగ్రెస్



సంజయ్ వదేకర్, జేడీఎస్

మొత్తం ఓట్లు	2,41,507
పురుషులు	1,25,845
మహిళలు	1,15,657

- జేడీఎస్ పోటీ నామమాత్రమే
- కాంగ్రెస్ నుంచి మాజీ సీఎం ధరంసింగ్ కుమారుడు విజయ్‌సింగ్
- బీజేపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే శరణు సల్గారే

జహీరాబాద్: జహీరాబాద్‌కు పక్కనే ఉన్న కర్ణాటకలోని బీదర్ జిల్లా పరిధి బస్వకళ్యాణ్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికల్లో పోటీ రసవత్తరంగా సాగుతోంది. ఈనెల 10వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ముఖ్యమంత్రి ధరంసింగ్ కుమారుడు విజయ్ సింగ్ పోటీ చేస్తున్నాడు. ఆయన స్థానికేతరుడు అయినప్పటికీ బస్వకళ్యాణ్ అసెంబ్లీ కేంద్రంగా రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. ఎమ్మెల్సీగా కూడా పనిచేశారు. దీంతో కార్యకర్తలతో పాటు అధిష్ఠానం సైతం విజయ్ సింగ్ అభ్యర్థిత్వానికి మొగ్గు చూపారు. దీంతో టికెట్ లభించింది. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీకి ఎవరూ లేకపోవడంతో విజయ్ సింగ్ పేరు ఖరారు చేసింది. బీజేపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే శరణు సలగర పోటీ చేస్తున్నాడు. 2018 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందిన బి.నారాయణ రావు కరోనాతో మరణించాడు. దీంతో 2021 లో ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో బీజేపీ నుండి పోటీ చేసిన శరణు సలగర గెలుపొందాడు. ఇతడికి మరోమారు బీజేపీ అవకాశం కల్పించింది. జేడీఎస్ తరఫున రిటైర్డ్ ఆర్డీఓ సంజయ్ వదేకర్ పోటీ చేస్తున్నాడు. ఇతడు కూడా స్థానికేతరుడే. దీంతో పార్టీ బలంపైనే ఆశలు పెట్టుకున్నాడు. నియోజకవర్గంలో జేడీఎస్‌కు తగినంత బలం లేకపోవడంతో పోటీ నామమాత్రంగానే ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ మధ్య పోరు నువ్వా నేనా అనే రీతిలో సాగుతోంది. ఫలితంగా ఎన్నిక రసవత్తరంగా మారింది. ఇరు పార్టీల అభ్యర్థులు గెలుపు కోసం సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. నియోజకవర్గంలో మొత్తం 10 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.2008లో బీజేపీ తరఫున బస్వరాజ్ పాటిల్ గెలుపొందారు. 2013, 2018లో కాంగ్రెస్ తరఫున బి.నారాయణ రావు గెలుపొందారు. 2021లో బీజేపీ నుంచి శరణు సలగార గెలిచారు. 2018లో బి.నారాయణ రావు కాంగ్రెస్ 61425 ఓట్లు పొందగా, బీజేపీ నుంచి పోటీ చేసిన మల్లికార్జున్ కుబాకు 44153 ఓట్లు లభించాయి. 2021 ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన శరణు సలగరకు 71,012 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన మల నారాయణరావుకు 50,383 ఓట్లు లభించాయి.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంగారెడ్డిటౌన్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో ప్రారంభించాలని, ఇప్పటి వరకు 167 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, మరో 42 కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉందని, వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని డీఆర్డీఓకు సూచించారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయించి, సంబంధిత రైస్ మిల్లులకు పంపాలని ఏఈఓలను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై ఫిర్యాదు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్రాలలో గన్ని బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉండాలన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ శరత్



ధర్నా చేస్తున్న పెద్దకంచర్ల గ్రామ రైతులు

- కలెక్టర్ డాక్టర్ శరత్
- ప్రజావాణికి 48 అర్జీలు

సంగారెడ్డిటౌన్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వర పరిష్కారంపై ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో ఐసీడీఎస్, ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీ అభివృద్ధి శాఖ, పంచాయతీ, హౌసింగ్, రెవెన్యూ, పశుసంవర్ధక, జిల్లా గ్రామీణ అభివృద్ధి, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 48 దరఖాస్తులు వచ్చాయన్నారు. 18 రెవెన్యూ శాఖ, 30 ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి.

రైతులకు న్యాయం చేయాలి

పటాన్‌చెరు మండలం పెద్దకంచర్ల రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వాలు భూములను సాగు చేసుకోవడానికి ఇచ్చాయన్నారు. ఇప్పుడు హెచ్ఎండీఏ కోసం భూములను తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తీసుకున్న భూములను నష్టపరిహారం చెల్లించి డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. అనంతరం ప్రజావాణిలో వినతి పత్రం ఇచ్చారు.

బదిలీలకు పచ్చజెండా

కొండాపూర్(సంగారెడ్డి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఎట్టకేలకు పరస్పర బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈనెల 6వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. కేజీబీవీలలో విధులు నిర్వహించే స్పెషల్ ఆఫీసర్, పీజీ సీఆర్‌టీ, సీఆర్‌టీ, ఏఎన్ఎం, అకౌంటెంట్, పీఈటీలకు షిఫ్టింగ్ అవకాశం కల్పించారు. ఇష్టం ఉన్న వారు మాత్రమే బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకుగానూ ఈ నెల 9వ తేదీ వరకు http://transfers.cdse.telangana. govt.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

- జిల్లాలో 17 కస్తూర్బా పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు ఉండగా, వీటిలో ఐదు కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యాబోధన కొనసాగుతోంది.
- కస్తూర్బా వసతి గృహాలలో జిల్లా వ్యాప్తంగా 17 పాఠశాలలకు సంబంధించి సీఆర్‌టీలో 136 మందికి గాను 121 మంది విధులు నిర్వహిస్తున్నారు. 15 ఖాళీలు ఉన్నాయి. అదేవిధంగా పీజీ సీఆర్‌టీలో 56 పోస్టులకుగాను 32 మంది విధులు నిర్వహిస్తున్నారు. 24 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- బోధనేతర సిబ్బందిలో ఏఎన్ఎం, అకౌంటెంట్‌లు, అటెండర్‌లు విధులు నిర్వహిస్తున్నారు. ఒకే చోట రెండు సంవత్సరాలు పూర్తిచేసిన వారు పరస్పర బదిలీకి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.
- బదిలీల ప్రక్రియ మొత్తం మూడు రకాలుగా జరుగుతుంది. ఉద్యోగుల పరస్పర బదిలీలు, జిల్లాల మధ్య పరస్పర బదిలీలు, జిల్లాలో బదిలీలు ఉంటాయి.
- ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగి పరస్పర అంగీకారంతో బదిలీఅయ్యే అవకాశాన్ని ప్రభుత్వం ఈసారి కల్పించింది. సాధారణ బదిలీలు మాత్రం కొత్త జిల్లా ప్రాతిపదికన జరుగుతాయి. బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తు పత్రాలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ద్వారా ఏర్పడిన కమిటీ సభ్యులు పరిశీలిస్తారు.

ఇది షెడ్యూల్

- ఈనెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఈనెల 10, 11వ తేదీలలో డీఈఓ కార్యాలయాల్లో దరఖాస్తుల అందజేత
- 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన
- 16వ తేదీన పాయింట్లతో కూడిన జాబితా విడుదల
- 17, 18వ తేదీలలో అభ్యంతరాల స్వీకరణ
- 18, 19వ తేదీలలో అభ్యంతరాల పరిశీలన
- 20వ తేదీన తుది జాబితా విడుదల
- 21, 22వ తేదీలలో వెబ్ ఆప్షన్‌లు
- 23, 24వ తేదీలలో వెబ్‌ఆప్షన్‌ల పరిశీలన
- 25, 26వ తేదీలలో అలాట్‌మెంట్
- 27 నుంచి 29 వరకు బదిలీల ఉత్తర్వుల జారీ

తీపి తగ్గలేదు

- చెరకు సాగుపైనే రైతుల ఆసక్తి
- కొనసాగుతున్న ప్లాంటేషన్
- 15 వేల ఎకరాల్లో పంట సాగు
- ఈ ఏడాది 4.50 లక్షల టన్నుల అంచనా



జహీరాబాద్ ప్రాంతంలో సాగు చేసిన చెరకు పంట (ఫైల్)

జహీరాబాద్ టౌన్: ప్రతికూల పరిస్థితులు ఉన్నా జహీరాబాద్ ప్రాంత రైతులు చెరకు పంట సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. పెద్దగా లాభాలు రాకున్న గత్యంతరం లేక చెరకు పంట సాగుకే మొగ్గు చూపుతున్నారు.

- విత్తనం నాటి నుంచి కర్మాగారంకు సరఫరా వరకు రైతులు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితులు ఉంటాయి. ఒక్కొక్కసారి గిట్టుబాటు ధర రాక, పంట దిగుబడి లేక పెట్టిన పెట్టుబడులు కూడా రావు.
- సాధారణంగా ఎకరానికి 40 టన్నుల వరకు దిగుబడి రావల్సింది. ప్రస్తుతం 25 టన్నులు మించి దాటడంలేదు.
- కష్టనష్టాలకు ఓర్చి పండించిన పంటను కర్మాగారానికి సరఫరా చేసినా బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. అయినా చాలా మంది రైతులు ఇంకా చెరకు పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

శాశ్వత నీటి వనరులు లేక..

- జహీరాబాద్ ప్రాంత నేలలు చెరకు, అల్లం, ఆలుతో పాటు కంది, సోయాబిన్,పత్తి, పెసర, మొక్కజొన్న, శనగ పంటలకు అనుకూలం.
- శాశ్వత నీటి వనరులు లేక రైతులు వరి సాగుచేయరు. లాభాలను పక్కన పెడితే పెద్దగా నష్టం రాదని ఎక్కువ మంది రైతులు చెరకు పంట వైపు మొగ్గుచూపుతారు. ఎకరం పొలం కలిగిన రైతు కూడా చెరకు పంట సాగు చేస్తాడు.

చక్కెర పరిశ్రమలకు సరఫరా

- జహీరాబాద్ పట్టణం సమీపంలో ట్రైడెంట్ కర్మాగారం ఉంది. అలాగే జిల్లా కేంద్రమైన సంగారెడ్డి వద్ద గణపతి చక్కెర కర్మాగారంతో పాటు పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో మూడు పరిశ్రమలు ఉన్నాయి.
- రైతులు పండించిన పంటను ట్రైడెంట్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని పరిశ్రమలకు సరఫరా చేస్తుంటారు.
- చెరకు పంటను నవంబర్ నుంచి జులై వరకు సాగు చేస్తుంటారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది సాగు విస్తీర్ణం అదే విధంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఏటా 3 లక్షల టన్నుల సాగు

- జహీరాబాద్ ప్రాంతంలో ఏటా సుమారు 3 లక్షల టన్నుల వరకు చెరకు పంట సాగవుతుంది.
- ఈ ఏడాది 4.50 లక్షల టన్నుల వరకు పంట ఉత్పత్తి కావచ్చని షుగర్ కేక్ జిల్లా అధికారి రాజశేఖర్ అభిప్రాయపడ్డారు.
- జహీరాబాద్ జోన్ పరిధిలో సుమారు 8–10 వేల మంది రైతులు చెరకు పంటను సాగుచేస్తుంటారు.
- 2021– 22లో సుమారు 20 వేల ఎకరాల్లో పంట సాగైంది.
- 2022– 23లో ఇప్పటి వరకు 15 వేల ఎకరాల్లో రైతులు పంట వేశారు.
- జూలై వరకు ప్లాంటేషన్ చేస్తుంటారు. అప్పటి వరకు మరో 3 వేల ఎకరాల విస్తీర్ణం పెరిగి 4.50 లక్షల టన్నుల చెరకు పంట ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది.

చెరకు పంటే ఆదుకుంటుంది



వర్షాలు కురిసినా, కురియకపోయినా గిట్టుబాటు ధర ఉన్నా, లేకపోయినా ఈ ప్రాంత రైతులు తప్పకుండా చెరకు పంటను సాగు చేస్తారు. చెరకు పంటే మమ్మల్ని ఆదుకుంటుంది. ఇతర పంటలు పండిస్తే పెట్టుబడులు కూడా రావు. అదే చెరకు పంటలో లాభం రాకున్న పెద్దగా నష్టం రాదు.

– శంకర్, రైతు, జహీరాబాద్

క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టు బడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 28 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 26 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున, ఒక వ్యక్తికి రూ.3వేలు, మరో వ్యక్తికి రూ.5వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: నారాయణఖేడ్ పట్టణంలో గత కొన్ని రోజులుగా నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 14మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని నారాయణఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం హాజరు పర్చగా న్యాయమూర్తి ఎం.శ్రీధర్ రూ.20వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. రెండోసారి మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలుకు పంపుతామని హెచ్చరించారు.

కల్హేర్(నారాయణఖేడ్): డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 14 మందికి జరిమానా విధిస్తూ నారాయణఖేడ్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ ఎం. శ్రీధర్ తీర్పు ఇచ్చారని ఎస్‌ఐ ప్రశాంత్ కుమార్ సోమవారం తెలిపారు. ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపుతామని హెచ్చరించారు.

ఇసుక లారీ పట్టివేత



నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలో సోమవారం రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకున్నారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ గంగ ప్రసాద్, ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇసుక లారీకి సరైన పత్రాలు లేని కారణంగా పట్టుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం లారీ మైనింగ్ అధికారులకు అప్పజెప్పినట్లు పేర్కొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

నారాయణఖేడ్: గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ పరిధిలోని కిషన్‌నాయక్ తండాకు చెందిన కర్ర సీతారాం నాయక్(51) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మృతుడి భార్య సీతాబాయి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మందుబాబుల ఆగడాలకు అడ్డేది?

- పాఠశాలపై కక్ష ఎందుకో ?
- తలుపులకు నిప్పు పెట్టిన దుండగులు
- గతంలో రెండు సార్లు ధ్వంసం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



తలుపుకు నిప్పు పెట్టిన దుండగులు



గది తలుపులు ధ్వసం చేసిన దృశ్యం (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): మద్యం సేవించి పాఠశాలకు నిప్పు పెట్టారు. తలుపులు, బండలు ధ్వంసం చేశారు. ఆ దుండగులకు పాఠశాలపై కక్ష ఎందుకని స్థానికులు చర్చించుకుంటున్నారు. పాఠశాల హెచ్‌ఎం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ప్రజాప్రతినిధులు అసలే పట్టించుకోరు. అధికారులైతే తమకేమి పట్టనట్టు వ్యవహరించడం ఇక్కడ పరిపాటిగా మారుతుంది. ఈ సంఘటనలు ఎక్కడో మారు మూల గ్రామంలో కాదు. పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో ఉన్న అల్లాదుర్గం ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకుంటున్న ఘటనలు.

- అల్లాదుర్గం ప్రాథమిక పాఠశాల తలుపులకు గుర్తు తెలియని దుండగులు ఆదివారం రాత్రి నిప్పు పెట్టారు. దీంతో తలుపులు కాలిపోయాయి. వేసవి సెలవులు కావడంతో దుండగులు రాత్రి వేళ మద్యం సేవిస్తున్నారు. ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.
- డిసెంబర్ 7, 2022, మద్యం సేవించి కొందరు పోకిరీలు తలుపులు పగులగొట్టారు. దీంతో టీచర్లు అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- మరోసారి మార్చి 3న మద్యం సేవించిన సీసాలు అక్కడే పడేశారు. పాఠశాలలోని ఓ గది తలుపు ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల హెచ్‌ఎం విఠల్, స్థానిక అధికారులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం శూన్యమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
- మళ్లీ ఆదివారం రాత్రి పాఠశాల తలుపులకే నిప్పు పెట్టారు. దీంతో ఉపాధ్యాయులు ఎస్‌ఎంసీ చైర్మన్‌తో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం విఠల్ చెప్పారు.

పట్టించుకోని నేతలు

అల్లాదుర్గంలో సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ ఇలా ఎంతో మంది నేతలు ఉన్న పాఠశాలపై దుండగులు మద్యం సేవించి ధ్వంసం చేస్తూ నిప్పు పెడుతున్న ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని సమావేశాల్లో గొప్పలు చెప్పే నేతలు ఇలాంటి సంఘటనలు ఎందుకు పట్టించుకోరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి దుండగులను పట్టుకోవాలని కోరుతున్నారు.

కుంట శిఖం కబ్జాకు యత్నం



ఆక్రమణకు గురవుతున్న కాంసాని కుంట

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామంలోని కాంసాని కుంటను ఆక్రమించాలని కొందరు పాల్పడుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..మిషన్‌కాకతీయ ఫేస్–3లో కాంసాని కుంటను మరమ్మతులు చేయించారు. ఇక్కడ మత్స్యకారులు చేపలను పెంచుకోవడంతో పాటు ఆయకట్టు వ్యవసాయ బావుల్లో నీటి ఊటలు పెరిగి రైతులకు సమృద్ధిగా సాగు నీరు లభిస్తుంది. దీంతో ఈ ప్రాంతంలో రియల్ వెంచర్లు కూడా వెలిశాయి. దీంతో కొందరు సమీపంలోని భూములను కొనుగోలు చేసి శిఖం భూమిని అక్రమించుటకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయంపై రైతులు, ప్రజా ప్రతినిధులు సోమవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు.

శిలాఫలకం ధ్వంసం

చెరువు, కుంటల మరమ్మతులు మిషన్ కాకతీయ పనుల వివరాలు తెలియ చేయుటకు అధికారులు శిలాఫలకం ఏర్పాటు చేశారు. కుంట శిఖం ఆక్రమించుటకు ప్రయత్నం చేస్తున్న కొందరు శిలాఫలకం ఆనవాళ్లు లేకుండా ధ్వంసం చేశారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దారు ఉన్నీసా బేగమును వివరణ కోరగా రైతుల ఫిర్యాదు మేరకు అక్కడి పనులను నిలిపివేశామన్నారు. ఇరిగేషన్ అధికారులతో సర్వేకు ఆదేశించామన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



చంద్రహాస్ (ఫైల్)

కోహీర్(జహీరాబాద్): యువకుడి మృతదేహం లభ్యమైన ఘటన మండలంలోని బడంపేట శ్రీ రాచన్న స్వామి ఆలయ ప్రాంగణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం..శ్రీ రాచన్న స్వామి ఆలయ ప్రాంగణంలోని అమృత గుండంలో గల్లంతైన బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన యువకుడు చంద్రహాస్ అలియాస్ చింటు మృతదేహం ఆదివారం రాత్రి దొరికింది. జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి తండ్రి లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

బదిలీలు సర్వసాధారణం

డీఎస్పీ భీమ్ రెడ్డి



సీఐ బీసన్నను సన్మానించిన డీఎస్పీ భీమ్ రెడ్డి, సీఐ వేణుగోపాల్ రెడ్డి, సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: పోలీస్ వృత్తిలో బదిలీలు సర్వసాధారణమని, ఎక్కడ ఉద్యోగం చేసినా వంద శాతం కమిట్ మెంట్‌తో పని చేయాలని పటాన్‌చెరు డీఎస్పీ భీమ్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ సీఐగా విధులు నిర్వహిస్తున్న బీసన్న బదిలీపై నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్‌కు వెళ్తుండడంతో సోమవారం పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి, ఎస్‌ఐలు సిబ్బందితో కలిసి బీసన్నను సన్మానించారు. అనంతరం సీఐ బీసన్న మాట్లాడుతూ..సీఐ వేణుగోపాల్ రెడ్డి, డీఎస్పీ భీమ్‌రెడ్డి కేసులు ఛేదించే విషయంలో ఎంతో సహకరించారన్నారు. అందరితో కలిసి ఏడాది పాటు పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు రామానాయుడు, దుర్గయ్య, ప్రసాదరావు, ఏఎస్‌ఐలు సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ మృతి

చేగుంట(తూప్రాన్): అనారోగ్యంతో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన ఉల్లితిమ్మాయిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన రజిత(30) అనారోగ్యంతో నార్సింగి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రుక్మాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన బోయిని శ్రీనివాస్(32) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి అలవాటు పడి ప్రతిరోజు మద్యం తాగేవాడు. మరోవైపు ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో ఏమి చేయాలో అర్థం కాక ఆదివారం రాత్రి పొలానికి వెళ్తున్నట్లు చెప్పి అక్కడ తను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చిరాగ్‌పల్లి–మాడ్గి చెక్‌పోస్ట్ వద్ద అసిస్టెంట్ కమిషనర్, సిబ్బంది

చెక్‌పోస్ట్ తనిఖీ

జహీరాబాద్ టౌన్: తెలంగాణ–కర్ణాటక అంతరాష్ట్ర సరిహద్దులో చిరాగ్‌పల్లి–మాడ్గి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సోమవారం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రఘురాం తనిఖీ చేశారు. కర్ణాటక రాష్ట్రంలో ఈ నెల 10న జరగనున్న సాధారణ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్–ముంబాయి 65వ జాతీయ రహదారిపై ఎక్సైజ్, పోలీసు శాఖలు సంయుక్తంగా వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా అసిస్టెంట్ కమిషనర్, సిబ్బంది కలిసి కర్ణాటకకు తరలివెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో హవాలా డబ్బు, మద్యం అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. సరిహద్దులోని చెక్‌పోస్టులో 24 గంటలు గట్టి నిఘా పెట్టామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలు

దుబ్బాకటౌన్: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి క్రింద పడడంతో ఆర్టీసీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన దుబ్బాక మున్సిపాలిటీ పరధిలోని దుంపలపల్లి రోడ్డులో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..దుంపలపల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ వేణు సోమవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో దుబ్బాక వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో మార్గ మధ్యలో బైక్ అదుపుతప్పి క్రింద పడడంతో వేణు తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీన్ని గమనించిన స్థానికులు 108కు సమచారం అందజేశారు. గాయపడ్డ వేణును చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు.

ఆర్థిక సాయం

గజ్వేల్‌రూరల్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 'ఆపన్నహస్త మిత్రబృందం' సభ్యునికి తోటి మిత్రులు ఆర్థిక సాయం అందజేశారు. రెండు నెలల క్రితం ఆపన్నహస్త మిత్రబృందం సభ్యుడు నరేష్ ఉద్యోగ రీత్యా ప్రైవేటు కంపెనీలో విధులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడనే విషయం తెలుసుకున్న మిత్రబృందం సభ్యులు రూ.57,500లు అందజేశారు. బాల్‌చంద్రం, శ్రీనివాస్, శ్యామ్‌ప్రసాద్, రాజు, పాల్గొన్నారు.

టాస్కులు, కమీషన్లతో సైబర్ మోసం

పటాన్‌చెరు: టాస్కులు పూర్తి చేస్తే కమీషన్ ఇస్తామని ఆశచూపి ఇద్దరిని సైబర్ నేరగాళ్లు మోసం చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని కిష్టారెడ్డిపేటకు చెందిన ఓ మహిళకు మార్చి 25వ తేదీన ఆన్‌లైన్‌లో జాబ్ ఉందని మెసేజ్ వచ్చింది. దీంతో బాధితురాలు లింక్ ఓపెన్ చేసి గుర్తు తెలియని వ్యక్తి చెప్పినట్టు వివరాలను నమోదు చేసింది. నగదు పెడుతూ, టాస్కులు పూర్తి చేస్తూ వచ్చింది. ఇలా పలు దఫాలుగా రూ.లక్ష 17వేలు పెట్టింది. దీంతో పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని కోరగా స్పందించలేదు. దీంతో బాధితురాలు మోసపోయినట్లు గుర్తించి, సైబర్ క్రైంలో ఫిర్యాదు చేసింది.

మరోఘటనలో..

అమీన్‌పూర్ పరిధిలోని వందపురి కాలనీలో ఓ వ్యక్తికి ఏప్రిల్ 30వ తేదీన ఆన్‌లైన్ జాబ్ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి, నగదు ఇన్వెస్ట్ చేశాడు. మొత్తం రూ. లక్ష 10వేలు పెట్టాడు. తిరిగి పెట్టిన డబ్బుతో పాటు కమీషన్ ఇవ్వాలని కోరగా స్పందించలేదు. దీంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశాడు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై దాడి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ యవకుడిపై కొంత మంది బీరుసీసాలతో దాడి చేసిన సంఘటన బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..బెల్ టౌన్‌షిప్‌లో నివాసం ఉండే వేణు తన మిత్రుడు భానుప్రకాష్‌తో కలిసి తన స్కూటీపై శారద గ్రౌండ్ వద్ద నుంచి వెళ్తుండగా అక్కడ ఉన్న గోపి, అక్షయలు వారిని ఆపి మాట్లాడేది ఉందన్నారు. వారిని వెంటబెట్టుకొని బెల్ టౌన్‌షిప్‌లో మూతపడిన హైయర్ సెకండరి స్కూల్ వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే అక్కడ 20మంది మద్యం సేవిస్తూ ఉన్నారు. అక్కడ ఉన్న వారిలో చరణ్ అనే వ్యక్తి వేణు తలపై బీరు సీసాతో కొట్టాడన్నారు. అవినాష్, మణికంఠ, సాయి కాళ్లతో తన్నారన్నారు. వేణును కాపాడేందుకు మిత్రుడు భానుప్రకాష్ విడిపించేందుకు ప్రయత్నించగా అతనిపై సైతం దాడికి దిగారు. ఈ క్రమంలో చంపాసాయి కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. అంతటితో ఆగక తిరిగి అవినాష్, సాయిచరణ్‌లు వేణు ఇంటి వద్దకు చేరుకొని అక్కడ అసభ్యపదజాలంతో దూషించినట్లు వేణు తన ఫిర్యాదులో తెలిపాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పరస్పర ఫిర్యాదులు

తనపై దాడి చేశారంటూ..

బీహెచ్‌ఈఎల్‌లో నివాసం ఉండే సాయిచరణ్‌పై కొంత మంది దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి..బెల్ టౌన్‌షిప్‌లో నివాసం ఉండే సాయిచరణ్‌తో కొంత మంది కలిసి హైయర్‌సెంకండరీ స్కూల్‌లో తమను కొడుతున్నారని మిత్రులు అవినాష్, మణికంఠలు ఫోన్ చేసి అతన్ని పిలిపించుకున్నారు. దీంతో అక్కడికి వచ్చిన సాయిచరణ్‌ను వేణు అసభ్య పదజాలంతో దూషించడంతో కోపం వచ్చి తను వేణు తలపై బీరు సీసాతో కొట్టాడని, అక్కడే ఉన్న అతని స్కూటీని తన మిత్రులు ధ్వసం చేసినట్లు ఒప్పుకున్నాడు. కాగా సాయిచరణ్ ఇంటికి వెళ్తుండగా కొంతమంది బైకుపై వచ్చి కర్రలతో తనపై దాడి చేశారన్నారు. దీంతో గాయాలపాలైన సాయిచరణ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుబ్బాక మార్కెట్ యార్డులో 500 రేకులు మాయం

కలెక్టర్, పోలీసులకు వాట్సప్‌ల ద్వారా రైతుల ఫిర్యాదు



ఓ ప్రాంతంలో దాచి ఉంచిన రేకులు

దుబ్బాకటౌన్: దుబ్బాక వ్యవసాయ మార్కెట్ యార్డులో రేకులమాయం జరిగిన సంఘటన వెలుగులోకి వచ్చింది. మార్కెట్ యార్డు నుంచి 2 నెలల క్రితమే సుమారు 500కు పైగా ఇనుపరేకులు మాయం అయినట్లు గుర్తించారు. సోమవారం తాజాగా ఓ ప్రాంతంలో పెద్ద ఎత్తున పాత రేకుల దంపు ఉందని వాటిపై గడ్డి కప్పి ఉంచారని, ఇవి దుబ్బాక మార్కెట్ యార్డుకు సంభందించినవేనని రైతు పాతూరి అంజిరెడ్డితో పాటు మరికొందరు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌కు వాట్సప్‌లో రేకులు ఉన్న ఫొటోలు తీసి ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ అధికారులు ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2 నెలల క్రితమే మార్కెట్ యార్డులో షెడ్‌కు సంబంధించి పాత రేకులు తొలగించి కొత్త రేకులు వేయించామన్నారు. తొలగించిన సుమారు 500 రేకులు మార్కెట్ కమిటీ కార్యాలయంలో పనిచేసే వారే ఇతరుల సాయంతో తరలించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ సంఘటన దుబ్బాక ప్రాంతంలో తీవ్ర చర్చానీయాంశంగా మారింది. దీనికి సంబంధించి మార్కెట్ కమిటీ సెక్రటరి పరమేశ్వర్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రావడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చికిత్స పొందుతున్న ఐదుగురి మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ఘటనల్లో గాయపడి చికిత్స పొందుతూ ఐదుగురు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి..



ప్రశాంత్



జగదీశ్వర్



దుర్గయ్య



మీసా రాయిడు (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బంజార గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన మీసా రాయుడు తనకు ఉన్న రెండు ఎకారల్లో వరి పంట సాగు చేశాడు. ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో పంట సాగుకోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చల్లో అర్థంకాక తాగుడకు బానిసయ్యాడు. దీంతో మస్థాపనికి గురై ఈ నెల 5న ఉదయం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుని భార్య రేణుక ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట(మెదక్): ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పొడిచన్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం..పొడిచన్ పల్లికి చెందిన శేరాల దుర్గయ్య(45) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 4న పొలం వద్ద ట్రాక్టర్లో వడ్లు నింపే క్రమంలో పై నుంచి క్రింద పడి గాయాల పాలయ్యాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు మెదక్ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. భార్య ఏశమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

రాయికోడ్(అందోల్): చేపల విక్రయానికి బైక్‌పై వెళుతూ ఆగి ఉన్న ట్రాలీ ఆటోను ఢీకొని తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం..సదాశివపేట మండలం బొబ్బిలిగామ గ్రామానికి చెందిన ఊరడి జగదీశ్వర్ (45) చేపలను విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 4న చేపల విక్రయం కోసం బైక్‌పై రాయికోడ్ వైపు వెళుతుండగా సింగితం గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి ఆగి ఉన్న ట్రాలీ ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జగదీశ్వర్‌ను సంగారెడ్డిలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ మదీనగూడలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఏడుకొండలు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి(తూప్రాన్): చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలపరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 6న వెల్దుర్తిలో ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో మానెపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. రెండురోజులుగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పక్షవాతంతో వ్యక్తి..

గజ్వేల్‌రూరల్: పక్షవాతంతో వ్యక్తిమృతి చెందాడు. సోమవారం గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని కొల్గూరు గ్రామానికి చెందిన గ్రామీణ తపాల ఉద్యోగి నీరుడి యాదగిరి(54) పక్షవాతంతో బాధపడుతున్నాడు. గత నెల 25న ఇంటి ఆవరణలోని బాత్‌రూమ్‌లో మూత్రవిసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. దీంతో కుటుంబీకులు సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జలాశయాల్లో విషాదగీతికలు

- నీటితో ఆటలొద్దు
- ఆహ్లాదం మాటున పొంచిఉన్న ప్రమాదం
- గోదావరి నీటితో నిండుకుండలా జలాశయాలు



నిండుకుండలా నాచగిరి హల్దీ చెక్‌డ్యాం

వర్గల్(గజ్వేల్): భారీ వర్షాల కారణంగా చెరువులు, డొంకలు అలుగులు పారుతున్నాయి. జిల్లాలో ఓ వైపు కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల నుంచి గోదారమ్మ గొలుసు చెరువులు, జలాశయాలు మత్తళ్లు దూకుతున్నాయి. మండు వేసవిలో నిండుకుండలా జలకళను సంతరించుకున్నాయి. ఈత కొట్టాలనే ఉబలాటం, సెల్ఫీ సరదా, చేపలు పట్టాలనే తాపత్రయం జలాశయాల్లోకి దిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఆహ్లాదం పంచాల్సిన ప్రదేశాలు కాస్తా విషాదాన్ని నింపుతున్నాయి. చెరువులు, వాగుల వద్దకు వెళ్తున్న వారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

కొండ పోచమ్మ, మల్లన్న సాగర్ ఆలంబనగా..

కొండ పోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టులు ఆలంబనగా గత మూడేళ్లుగా హల్దీ, కుడ్లేరు వాగుల ద్వారా ప్రవహిస్తున్న గోదావరి జలాలతో జిల్లాలో చెరువులు, చెక్‌డ్యాంలు, జలాశయాలు ఏడాది పొడవునా నిండుకుండలా కళకళలాడుతున్నాయి. మట్టి తవ్వకాల కారణంగా జలాశయాల్లో జేసీబీ తీసిన గోతులు మృత్యు కుహరాలుగా పొంచి ఉన్నాయి.

తస్మాత్ జాగ్రత్త..

వేసవి సెలవుల్లో హల్దీ ఒడ్డున ఉన్న నాచగిరి పుణ్యక్షేత్రం, కొండ పోచమ్మ ప్రాజెక్టుల వద్ద సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇక్కడి జలాశయాల్లోకి స్నానాల కోసం, ఈత కొట్టేందుకు, ఫొటోల దిగేందుకు వస్తుంటారు. జలాశయాల వద్ద ఆలయ వర్గాలు, ఇరిగేషన్ అధికారులు సెక్యూరిటీని పెడితే బాగుంటుంది.

- చెరువులు, జలాశయాలు ఉన్న గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారులు చాటింపు వేయించాలి.
- చుట్టపు చూపుగా గ్రామాలకు వచ్చే బంధువులకు చెరువులపై అవగాహన ఉండదు. వారు అటువైపు వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా కుటుంబీకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- చేపలు పట్టేందుకు చెరువులోకి వెళ్లేవారికి అవగాహన కల్పించాలి.
- అప్పుడే జలాశయాలు ఆహ్లాదాన్ని పంచుతాయి. విషాదాలకు అడ్డుకట్ట పడుతుంది.